క్లుప్తంగా

దైవచింతనతో జీవించండి



తెనాలిఅర్బన్: ప్రతి ఒక్కరూ దైవచింతనతో జీవించాలని ఆల్ ఇండియా ది సాల్వేషన్ ఆర్మీ టెరిటోరియల్ కమాండర్ దాసరి డానియేల్ రాజు పేర్కొన్నారు. కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి తెనాలి వచ్చిన ఆయనకు ఆదివారం ఘనస్వాగతం పలికారు. అనంతరం సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాల్వేషన్ ఆర్మీ ద్వారా అనేక చర్చిలను ఏర్పాటు చేసి క్రీస్తు సందేశాలు అందిస్తున్నట్లు తెలిపారు. అందరూ ఏసుక్రీస్తు బోధించిన మార్గంలో నడవాలన్నారు. లెఫ్టినెంట్ కల్నల్‌లు గేరా థామస్, జి.సియోను కుమారి, బి.బెనర్జీ, టి.కోటయ్య, గాలి రవికుమార్, కె.ఆర్.ఆర్.బాబు, జె.క్రీస్తు దాసు, రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుడికి లగేజీ అప్పగింత



తెనాలిరూరల్: రైలు ప్రయాణంలో అనుకోకుండా పోగొట్టుకున్న లగేజీని తిరిగి ప్రయాణికుడికి రైల్వే పోలీసులు అప్పగించారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. అమృతలూరు మండలం పెదపూడి గ్రామానికి చెందిన సురేంద్ర శనివారం బెంగళూరు నుంచి విజయవాడ వెళ్లే రైలులో ప్రయాణించారు. వాస్తవానికి సురేంద్ర తెనాలిలో దిగాల్సి ఉంది. కానీ రైలుకు తెనాలిలో హాల్టు లేదు. రైలు తెనాలి స్టేషన్ సమీపంలోకి రాగానే సిగ్నల్ లేని కారణంగా నిదానించింది. ఆ సమయంలో రైలు నుంచి దిగేందుకు ప్రయత్నించిన సురేంద్ర ముందుగా తన లగేజ్ ని కింద పడేసాడు. తను దిగటానికి ప్రయత్నించే లోగా రైలు బయలుదేరటంతో దిగలేకపోయాడు. విజయవాడ దిగిన అనంతరం తిరిగి తెనాలి రైల్వే పోలీసుల వద్దకు వచ్చి విషయం తెలియజేయడంతో అప్పటికే స్వాధీనం చేసుకున్న లగేజ్ ని సురేంద్రకు అప్పగించారు. ఈ సందర్భంగా జీఆర్పీ పోలీసులకు సురేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం



తెనాలిఅర్బన్: ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకుడు కేబీ ప్రసాద్ హెచ్చరించారు. తెనాలి ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ కార్యాలయం ముందు కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగులు రోడ్డు ఎక్కి ఐదురోజులు దాటుతున్నా నేటికీ ప్రభుత్వం నుంచి స్పందన కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాల్సిన పాలకులు వారి హక్కులను విస్మరించడం బాధకరమన్నారు. యూనియన్ నాయకులు షేక్ హుస్సేన్ వలి, సురేష్, దిలీప్‌కుమార్, చక్రి, గోపికృష్ణ, ప్రశాంత్, ప్రదీప్, గౌస్, రత్నకుమారి, రాజ్యలక్ష్మి, లీలావతి, సునీల్, సతీష్, శ్రీధర్, ఎం.కృష్ణ, కరిముల్లా, ఈశ్వరరావు, కిరణ్‌కుమార్, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకార ర్యాలీ

తాడేపల్లి రూరల్: మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణ టీడీపీ కార్యాలయం నుంచి మార్కెట్ యార్డ్ వరకు ఆదివారం టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఉయ్యాల శ్రీనివాసరావు, షేక్ దుబాయ్ మస్తాన్, దారా దాసు, దానబోయిన సుందరరావు యాదవ్, ఇట్టా భాస్కర్, అన్నెం కుసుమ, కాటాబత్తుని నిర్మల సాగర్, ఇట్టా పెంచలయ్య, టి.గోపి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లా రహదారులు



ప్రత్తిపాడు: చిన్నపాటి వర్షానికే ఆర్అండ్‌బీ రహదారులు చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి కురుస్తున్న ఓ మోస్తరు వర్షానికి వట్టిచెరుకూరులోని మెయిన్ రోడ్డు ఇలా తటాకంలా మారిపోయింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, ప్రధాన రహదారిలోని కల్వర్టు వద్ద నీటి పారుదల సవ్యంగా లేకపోవడంతో మోకాళ్ల లోతు వర్షపు నీరు నిలిచిపోయింది. ఆ నీటిలోనే ప్రయాణిస్తూ ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

శతజయంతి సదస్సులో 'శారద' కుటుంబం

గతంలో సాహితీ లోకానికి పరిచయం చేసిన 'సాక్షి'



'శారద' సంతానం సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణమూర్తి, శారదతో అతిథులు

తెనాలి: సాహిత్య అకాడమీ, స్వాతంత్ర్య సమర యోధుడు వడ్లమూడి గోపాలకృష్ణయ్య, వెంకటలక్ష్మమ్మ ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం స్థానిక పెన్షనర్స్ హాలులో నిర్వహించిన ప్రముఖ రచయితలు ఆలూరి బైరాగి, శారద (ఎస్.నటరాజన్) శత జయంతి సదస్సులో శారద కుటుంబసభ్యులు పాల్గొనటం ప్రత్యేకతగా నిలిచింది. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగిన సదస్సుల్లో శారద కుమారులు, కుమార్తె, మనవ సంతానం హాజరయ్యారు. సాహిత్య అకాడమీ నిబంధనల ప్రకారం శారద కుటుంబం నుంచి ఆయన కుమార్తె శారద ఒక్కరికే వేదికపై అవకాశం కల్పించారు. అయినప్పటికీ ఆమెతోపాటు ఆమె సోదరులు సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణమూర్తిలను ప్రారంభ సభానంతరం ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సభాధ్యక్షుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి చేతులమీదుగా సత్కరించారు.

64 ఏళ్ల తర్వాత వెలుగులోకి..

12–13 ఏళ్ల వయసులో తమిళనాడు నుంచి తెనాలిలో తండ్రితో సహా అడుగుపెట్టి, జీవనం కోసం హోటల్ కార్మికుడిగా దుర్భర జీవనం అనుభవిస్తూ తెలుగు నేర్చుకుని నేటికి నిలిచేంత సాహిత్యాన్ని రచించిన శారద, 1955లో మృతిచెందారు. అప్పటికాయన వయసు 31 ఏళ్లు. చనిపోయేనాటికి భార్య అన్నపూర్ణమ్మ నిండుగర్భిణి. అప్పటికే ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకు భారమైన స్థితిలో అన్నపూర్ణమ్మ తెనాలిని విడిచిపెట్టారు. తర్వాతి కాలంలో ఆ కుటుంబం గురించి సాహితీ ప్రపంచానికి ఏమాత్రం తెలియలేదు. అటువంటి నేపథ్యంలో శారద మరణించిన 64 ఏళ్ల తర్వాత 2019లో శారద కుటుంబాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. 'ఇదిగో శారద కుటుంబం' శీర్షికన ప్రచురించిన కథనం తెలుగు సాహితీలోకంలో సంచలనం. అప్పట్లో 'అరసం' వారిని సత్కరించింది. మళ్లీ ఇప్పుడు శారద సంతానం తమ బిడ్డలతో సహా శత జయంతి హాజరుకావటం విశేషం. ఎక్కడెక్కడ నుంచో వచ్చిన రచయితలు వారిని పరిచయం చేసుకుని తమ సంతోషాన్ని పంచుకున్నారు.



2019 జూన్ 23న 'ఇదిగో శారదా కుటుంబం' శీర్షికన ప్రచురితమైన కథనం

పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

పెనుకొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ బాలస్వామిజీ



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న స్వామిజీ

తెనాలిటౌన్: మానవ సేవే మాధవ సేవని ప్రతి ఒక్కరూ సేవానిరతి కలిగి ఉండాలని పెనుకొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ బాలస్వామిజీ పిలుపునిచ్చారు. కొల్లిపర మండలం కుంచవరం గ్రామంలో ఆంధ్ర ప్రైమ్ హాస్పటల్ ఆధ్వర్యంలో పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు టి.శ్రీనివాసరావు, కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ డీఎల్ కాంతారావు అధ్యక్షతన వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ బాలస్వామిజీ పాల్గొని వారాహిమాతకు పూజాది కార్యక్రమాలు నిర్వహించి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజల సేవార్థం ఇటువంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించడం ముదావహమని నిర్వాహకులను అభినందించారు. ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ డేగల ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. మంచి ఆశయాతో పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ట్రస్ట్ పనిచేస్తుందని అభినందించారు. ఆంధ్ర ప్రైమ్ హాస్పటల్ వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ అన్వేష్, డాక్టర్ కె.సాయి రాజశేఖర్, డాక్టర్ తేజస్వి, డాక్టర్ చెరుకూరి జగదీష్, డాక్టర్ బి.పవన్‌కుమార్, డాక్టర్ సురేష్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

కళల తెనాలి వారసత్వం అందరి బాధ్యత

- హరికథకుడు సాంబశివరావు పదో సంస్మరణ ఉత్సవాల్లో మంత్రి మనోహర్
- అలరించిన హరికథాగానం



పేద కళాకారులకు మంత్రి మనోహర్‌చే ఆర్థికసాయం

తెనాలి: తెనాలి కళానిలయం అన్న ఖ్యాతిని నిలబెట్టుకోవాల్సిన ఆవశ్యకత ఉందని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కళాకారులను ఆదరించాలని, గౌరవించుకోవాలని, పట్టణంలో నిత్యం కళారూపాల ప్రదర్శనలు కొనసాగాలన్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ హరికథకుడు నన్నపనేని సాంబశివరావు భాగవతార్ పదో సంస్మరణను ఆదివారం రాత్రి తెనాలిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన సభకు అంతర్జాతీయ కళాకారుడు ఆరాధ్యుల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కళాకారుల సంక్షేమం కోసం కృషిచేస్తామని చెప్పారు. త్వరలో తెనాలిలో రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవం జరుపుతామని చెప్పారు. కళాకారులకోసం అందరూ ఆలోచన చేయాలన్నారు. గతంలో తెనాలి ఓపెన్ ఆడిటోరియమ్, కళాక్షేత్రంను తీసుకొచ్చామని, తెనాలి రామకృష్ణకవి విగ్రహాన్ని తొలిసారిగా ఇక్కడ మున్సిపాలిటీ శతాబ్ది ఉత్సవాల్లో ఏర్పాటుచేసినట్టు గుర్తుచేశారు. స్త్రీలు ఇక్కడ హరికథారంగంలో రాణించటం గొప్ప విషయమన్నారు. ప్రియదర్శిని విద్యాసంస్థల అధినేత చందు రామారావు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణారావు, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, స్థానిక ప్రముఖులు కోట అక్కేశ్వరరావు, హరిదాసు గౌరీశంకర్, విన్నకోట రామకుమారి, బెజ్జంకి నాగమణి మాట్లాడారు. సభలో 20 మంది పేదకళాకారులకు రూ.5 వేల వంతున రూ.లక్ష ఆర్థికసాయాన్ని మంత్రి మనోహర్ చేతులమీదుగా అందజేశారు.



హరికథ చెబుతున్న విన్నకోట భాగవతారిణి, పసుపులేటి శివకుమారి, ఎస్.వేదవతి

ఆకట్టుకున్న హరికథాగానం..

తొలుత ఒంగోలుకు చెందిన ఎస్.వేదవతి 'శ్రీకృష్ణరాయబారము' హరికథ, తిరుపతికి చెందిన పసుపులేటి శివకుమారి 'భక్తమార్కండేయ' హరికథ, పట్టణానికి చెందిన విన్నకోట రామకుమారి 'నర్తనశాల' హరికథలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సభానంతరం ప్రఖ్యాత రంగస్థల నటుడు డీవీ సుబ్బారావు మనుమడు డీవీ సుబ్బారావు, షేక్ తిరుమలబీచే సత్యహరిశ్చంద్ర నాటకంలోని 'కాటిసీను' ప్రదర్శించారు. సాంబశివరావు కుమారులు నన్నపనేని వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, రాంబాబు, ఆహ్వాన కమిటీ బాధ్యులు పర్యవేక్షించారు. శ్రీదేవి స్వాగతం పలికారు.

మనసారె సమర్పయామీ..!



బాలాజీరావుపేటలో శాకంబరి అలంకరణలో దుర్గాదేవి

ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక బాలాజీరావుపేట ప్రధాన అయ్యప్ప స్వామి దేవాలయంలో దుర్గమ్మవారికి ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. ప్రధాన అర్చకుడు దుర్భ హరిబాబు శాస్త్రి పర్యవేక్షించారు. కొలవెరం గ్రామంలో వేంచేసి యున్న మర్లమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి మహిళలు ఆషాఢ మాస సారె సమర్పించారు.

– తెనాలిటౌన్



కొలవెరంలో ఊరేగింపుగా సారె తరలింపు..



అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

ముగిసిన ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని చినకాకాని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళగిరి శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ హైదరాబాద్ ఏషియన్ వ్యాస్కులర్ హాస్పటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. సాధారణ వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీ సుసిరాణి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం.మాధవి లత, దంత వైద్య నిపుణులు డాక్టర్ జీవన, వ్యాస్కులర్ అండ్ ఎండో వ్యాస్కులర్ వైద్య నిపుణులు డాక్టర్ జీవీ ప్రమోద వైద్య సేవలను అందించారని పేర్కొన్నారు. ఎన్ఆర్ఐ కార్డియాలజీ విభాగం మెడికల్ విద్యార్థులు, నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులు రోగులకు సేవలను అందించారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు పూసపాటి సాయికృష్ణ, భజన మండలి కన్వీనర్ డాక్టర్ రాయపాటి రామారావు, ఆధ్యాత్మిక ప్రతినిధి ఆర్టీసీ ప్రసాద్, మహిళా విభాగం ప్రతినిధులు రాధిక, లక్ష్మి శ్యామల, హాస్పటల్ మార్కెటింగ్ మేనేజర్ వి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో శ్రమదానం

తాడేపల్లి రూరల్: సీతానగరం బోటు యార్డ్ దగ్గర నుంచి హైస్కూల్‌కు వెళ్లే మార్గం పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలతో నిండిపోయింది. దీంతో ఆదివారం స్థానికులు, విద్యార్థినీ విద్యార్థులు శ్రమదానం చేసి దారిని శుభ్రం చేశారు. పాఠశాలకు వెళ్లి రావడానికి ఇబ్బంది కరంగా ఉండడంతో స్థానికుల సహకారంతో విద్యార్థులు శ్రమదానం చేసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు మేరి, కొండలు, పల్లవి, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏసీసీ కార్మికుల దీక్షలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారానికి 229వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు ప్రారంభించి మాట్లాడారు. ఏసీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు కార్మికులకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కూరపాటి స్టీవెన్, ఆదినారాయణ, కార్మికులు నవనీతం, దానయ్య, గురవయ్య, సారమ్మ, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

260 మందికి వైద్యపరీక్షలు

రూ.80 వేల విలువైన మందుల పంపిణీ



వైద్యశిబిరంలో పరీక్షలు

తెనాలి: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండాలనే ఉద్దేశంతో తమ వంతుగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కంకిపాటి రమేష్ కుమార్ అన్నారు. స్థానిక నాజరు పేట పుట్టా రాఘవయ్య రైస్ మిల్ సమీపంలోని తిరుపతమ్మ తల్లి గుడివద్ద సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ, అమరావతి సర్జికల్ కార్పొరేషన్, సుజాత హెల్త్ క్లినిక్, సిటీ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన వైద్య శిబిరంలో డాక్టర్ పి.శ్రావణి 260 మందికి పైగా రోగులకు బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె జబ్బులు, గ్యాస్ సంబంధిత పరీక్షలు నిర్వహించి రూ. 80 వేల విలువైన మందులను సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. సంస్థ కార్యదర్శి బి.సుధాకర్, సభ్యులు ఏవీ సత్యదేవ్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మాదల పూర్ణచంద్రరావు, గంజి శివ భుజంగ ప్రభాకరరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

8వ రోజుకు కార్మికుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న కార్మికులు

తాడేపల్లి రూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె ఆదివారానికి 8వ రోజుకు చేరుకుంది. ఎంటీఎంసీ పరిధిలోని ఎర్రబాలెంలో కార్మికులు చేస్తున్న సమ్మెకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎంటీఎంసీ రాజధాని ప్రాంత గౌరవ అధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడాలని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కార్మికులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా జీతాలను పెంచాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎర్రబాలెం అధ్యక్షులు లేళ్ల శివ, నాయకులు షేక్ బడేమియా, దానబోయిన నాగయ్య, ఆకుల శంకర్, షేక్ షఫీ, దాసరి ప్రియానందం, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు టి.బాబూరావు పాల్గొన్నారు.

తాడేపల్లిలో..

తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆదివారం ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మద్దతు తెలియజేసి మాట్లాడారు. కార్మికులు చేస్తున్న న్యాయమైన సమ్మెను, సహేతుకమైన వారి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, డి.వెంకట్ రెడ్డి, మేస్త్రి శ్రీనివాసరావు, కార్మికులు డేవిడ్, మరియమ్మ, సంతోషం, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాకంబరి పూజలు



విశేష అలంకరణలో గంగానమ్మ తల్లి



శాకంబరిగా శ్రీ నాగారపమ్మ అమ్మవారు

చేబ్రోలు: చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలోని గ్రామదేవత గంగానమ్మ తల్లి అమ్మ వారు ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి సారేను మేళతాళాలతో మహిళలు ఊరేగింపుగా తీసుకువెళ్లి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

పెదకాకాని: గ్రామ దేవత శ్రీనాగారపమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరి దేవిగా పూజలందుకున్నారు. అమ్మవారిని ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలతో శోభాయమానంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహిళలు అమ్మవారికి ఆషాఢ మాస సారె సమర్పించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. నిర్వాహకులు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గంగానమ్మకు బోనాలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడలో కొలువైన గంగానమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పాటిబండ్ల నారాయణరావు మాట్లాడుతూ.. శ్రీ గంగానమ్మ తల్లి అమ్మవారికి బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కారసనేని అంకినేయుడు, లక్ష్మీ పార్వతి, పాటిబండ్ల నారాయణరావు, గాయత్రీదేవి, వెంకట సాంబ శివ ప్రసాదరావు, నాగరాజ కుమారి, మొవ్వ నాగేశ్వరరావు, జె.శివ, పి.గాయత్రీదేవి, కసారినేని సుష్మ, కసుకుర్తి లింగేశ్వరరావు, కసుకుర్తి జయలక్ష్మి, మేడికొండ ఉమామహేశ్వరరావు, నాగ శిరోణి, పరుచూరి భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: ఈ యేడు వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామ దేవతలైన గంగానమ్మ తల్లి, గోగులమ్మతల్లికి ఆదివారం ఈమని గ్రామంలో జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని భక్తులు మేళతాలాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. ధరణికోట సాంబయ్య పూజలు నిర్వహించగా ఏర్పాట్లను మాజీ యార్డు డైరెక్టర్ కుప్పాల శ్రీరాంమూర్తి పర్యవేక్షించారు. కార్యక్రమంలో యలమందయ్య, నర్సయ్య, కె.కోటేశ్వరరావు, యడ్ల సాయికృష్ణ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం అందజేత



మంగళగిరి టౌన్: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, డైరెక్టర్ షేక్ అక్రమ్‌లకు మంగళగిరి నగరంలోని వివిధ జమాత్‌లకు చెందిన ముస్లిం ప్రతినిధులు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం ప్రతినిధులు మాట్లాడుతూ.. నగరంలోని ముస్లిం శ్మశాన వాటిక (ఖబర్‌స్థాన్) పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరామని, నగరంలో 20 ఏళ్లుగా ఉన్న ముస్లిం శ్మశాన వాటికను రహదారి విస్తరణ పేరుతో కొంత భాగాన్ని తొలగించాలన్న మున్సిపాలిటీ ప్రతిపాదనపై తాము అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని వివరించినట్లు తెలిపారు. ఈ ఖబర్‌స్థాన్ వక్ఫ్‌బోర్డు నోటిఫై చేసిన స్థలం కావడంతో దీని పరరక్షణ కూడా వక్ఫ్‌బోర్డు బాధ్యతగా తీసుకోవాలని వినతిపత్రంలో కోరామని పేర్కొన్నారు.